కులదీప్ బెయిల్ రద్దు చేయాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో 2017లో బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారం చేసిన ఘటనలో అప్పటి బిజెపి ఎమ్మెల్యే కులదీప్ సింగ్ బెయిల్ రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కామనురు శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసు విచారణ క్రమంలో అధికార బాధితురాలి పక్షాన నిలబడకపోగా, న్యాయం కోసం వెళ్లిన బాధితురాలి తండ్రిని పోలీసు కస్టడీలో హత్య చేశారని తెలిపారు. కులదీప్‌కు బెయిల్ ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. విచారణ క్రమంలో బాధితురాలి పట్ల ప్రభుత్వ యంత్రాంగం క్రూరమైన వైఖరితో, దౌర్జన్యపూరితంగా వ్యవహరించడాన్ని నిరసిస్తున్నామని చెప్పారు.

అన్నమయ్య జిల్లా కేంద్రంగా మదనపల్లె

- కడపలోకి రాజంపేట, తిరుపతిలోకి రైల్వేకోడూరు, మదనపల్లిలోకి రాయచోటి
- మంత్రి 'మండిపల్లి' తుదికంటా విఫలయత్నం
- రాయచోటికి మెడికల్ కళాశాల హామీ?!
- మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లెకు మారింది. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలోని అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు జిల్లాల శాస్త్రీయ విభజన పేరుతో కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసి పలుమార్లు అధ్యయనం చేసింది. అధ్యయన బృందం తయారు చేసిన నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. శని, ఆదివారాల్లో కేబినెట్ సబ్ కమిటీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సమావేశమై చర్చించింది. సోమవారం ముఖ్యమంత్రి అధ్యక్షతన నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో తుదినిర్ణయం తీసుకుంది. 22 ఎజెండా అంశాలపై చర్చించింది. అన్నమయ్య జిల్లాను మూడు ముక్కలుగా చీల్చుతూ జిల్లా అస్తిత్వాన్ని ప్రశ్నార్థకంగా మార్చుతూ తుది నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రాజకీయ కలకలం రేగింది. రాయచోటి జిల్లా కేంద్ర పరిరక్షణ పోరులో రాయచోటి అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహిస్తున్న రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తుదివరకు పోరాడినప్పటికీ ఎటువంటి ఫలితమూ లేకుండా పోయింది. ఆయన చేసేదేమీ లేక పోవడంతో భావోద్వేగానికి గురై కన్నీటి పర్యంతం కావడం అందరి దృష్టినీ ఆకర్షించింది. చివరికి ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని మంత్రి మండిపల్లిని సముదాయించినట్లు సమాచారం. రాయచోటి అభివృద్ధికి తానుబాధ్యత వహిస్తానని, మీకు అండగా ఉంటానని ఊరడించినట్లు తెలుస్తోంది. రాయచోటికి ప్రభుత్వ మెడికల్ కళాశాలను కేటాయిస్తాననే హామీతో ఊరడించినట్లు కనిపిస్తోంది. ఆదివారం నాటి కేబినెట్ సబ్ కమిటీ సమాలోచనల ప్రకారమే అన్నమయ్య జిల్లాను మూడు ముక్కలుగా విభజిస్తూ తుదినిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. పూర్వ అన్నమయ్య జిల్లాకు చెందిన రాజంపేట అసెంబ్లీని కడప జిల్లాలోనికి, రైల్వే కోడూరును తిరుపతి జిల్లాలోనికి, ఇటీవలే ఏర్పాటైన మదనపల్లి జిల్లా కేంద్రంలోనికి రాయచోటి అసెంబ్లీని తరలింపు నిర్ణయాలను కేబినెట్ ఆమోదించింది. ఈనెల 31న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది.

పేదల భూములు లీజుకివ్వడం దుర్మార్గం

- వ్య.కా.స జిల్లా కార్యదర్శి అన్వేష్

ప్రజాశక్తి-కడప అర్బన్

ఒంటిమిట్ట రెవెన్యూ గ్రామం సర్వే నంబర్ 2050లో స్థానిక సాగులో ఉన్న భూములను హైవే రోడ్డు కాంట్రాక్టర్‌కు ఇవ్వటం చాలా దుర్మార్గమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, ఉపాధ్యక్షులు కోనేటి నరసయ్య అన్నారు. సోమవారం కడప ఆర్‌డిఒ జాన్ ఇర్విన్ పాలపర్తికి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భూమి కోల్పోయిన పేదలతో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అన్వేష్, నర్సయ్య మాట్లాడుతూ సోమశిల నిర్వాసితులు కొత్త మాధవరం, ఒంటిమిట్ట, ముకుంద్రశ్రం, మల్లేశ్వరపురం గ్రామాలకు చెందిన పేదలు సర్వే నంబర్ 2050 ప్రభుత్వ భూమి 2017 సంవత్సరం నుంచి జెసిబిలు, ట్రాక్టర్లకు యంత్రాలకు రూ.లక్షలు ఖర్చు చేసి ఆముదాలు పంటలు వేసి సాగులో ఉన్నారని పేర్కొన్నారు. అటువంటి భూమిని హైవే కాంట్రాక్టర్లకు క్రషర్‌మిషన్‌కు అప్పజెప్పడం సమంజసం కాదన్నారు. ఒంటిమిట్ట తహశీల్దారు పేదలు సాగులో ఉన్నారా లేదా విచారించకుండానే ఏకపక్షంగా హైవే కాంట్రాక్టర్లకు లీజుకు ఇవ్వటం అన్యాయమన్నారు. రెవెన్యూ అధికారులు ప్రజా అవసరాల పేరుతో దళితులు, పేదల భూములను మాత్రమే లాక్కోవడం ఆనవాయితీ అయిందన్నారు. 12 సంవత్సరాల నుంచి టిడిపి, వైసిపి పరిపాలించిన ప్రభుత్వాలు సాగు చేసుకున్న పేదలకు అసైన్‌మెంట్ కమిటీ ద్వారా పట్టాలు ఇవ్వాలని అనేక దపాలుగా అప్పటి తహశీల్దారు, ఆర్‌డిఒ, కలెక్టర్ దృష్టికి వినతి పత్రాలు, ఆందోళన, ధర్నాల రూపంలో తెలియజేశామన్నారు. ఈపాటికి పేదలకు పట్టాలు పంపిణీ చేసి ఉంటే ఈ పరిస్థితి ఏర్పడేది కాదన్నారు. కడప ఆర్‌డిఒ జాన్ ఇర్విన్ మాట్లాడుతూ అర్హులైన పేదలకు ఆభూమి పట్టాలు పంపిణీ చేస్తామని తెలిపారు. హైవే రోడ్డు కాంట్రాక్టర్లకు కేవలం మూడు సంవత్సరాలు లీజుకు మాత్రమే ఇచ్చారన్నారు. కాంట్రాక్టర్లు ఆ భూమిలో ఎటువంటి గుంతలు తీయకూడదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు రాము, సాంబయ్య, వెంకటేశు, ఓబులేశు, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆర్‌డిఒ వినతిపత్రం అందజేస్తున్న అన్వేష్

అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి : డిఆర్‌ఒ

ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడు

ప్రజాశక్తి - కడప

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సభాభవన్ సమావేశ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరించారు. డిఆర్‌ఒ, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా రీఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు. కింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారే వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. ఎండార్స్ ఇచ్చిన అర్జీలకు జిల్లా అధికారులు ఖచ్చితంగా పరిశీలించాలన్నారు. పిజిఆర్ఎస్‌లో రీఓపెన్ అయిన అర్జీలను మరింత నాణ్యతతో పరిష్కరించాలి. జిల్లా అధికారులు మీకు వచ్చిన అర్జీలను సమయం కేటాయించి రివ్యూ చేయాలన్నారు. ఎవరైనా అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని అధికారులను హెచ్చరించారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఎ లేకుండా చూడాలన్నారు.అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. కడప మండలం రవీంద్ర నగర్‌కు చెందిన షేక్ షేహాజది తనకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేవలసిందిగా కోరుతూ అర్జీని సమర్పించారు. బి.కోడూరు మండలం మేకవారిపల్లె గ్రామానికి చెందిన బి.రత్నమ్మ నా పాప వంశీ ప్రియాకు వికలత్వం 4 శాతం ఉన్నది పింఛన్ మంజూరు చేయవలసిందిగా అర్జీని సమర్పించారు. బద్వేలు నియోజకవర్గం లోని గోపవరం మండల గ్రామంలోని సర్వే నెంబర్ 107/1-1కు పట్టాదార్ పాస్‌బుక్‌ను ప్రభుత్వం తరపున నాకు మంజూరు చేయాలని జయరామయ్య కోరుతూ అర్జీని సమర్పించారు అట్లూరు మండలం కుంభగిరి గ్రామానికి చెందిన గ్రామ సర్పంచ్ ఐన కోనేటి గంగమ్మ కుంభగిరి గ్రామంలో ఇరవై ఎకరాల ప్రభుత్వ భూమిని మందర పోరంబోకు స్థలాన్ని కొంతమంది ఆక్రమించడం జరిగిందని అర్జీని సమర్పించారు. దువ్వూరు మండలం నకు చెందిన ఎం. నరసింహులు తన భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీని సమర్పించారు. కార్యక్రమంలో జడ్‌పి సిఇఒ ఓబుళమ్మ, డిఆర్‌డిఎ పీడీ జి.రాజ్యలక్ష్మి ఎంప్లాయిమెంట్ అధికారి సురేష్, డిప్యూటీ కలెక్టర్లు శిరీష, రంగస్వామి, ఎస్ఎస్ఎ పిఒ ప్రేమంత్ కుమార్, మెప్మా పీడీ కిరణ్ కుమార్ వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయురాలు

- పాఠశాల వద్ద తల్లిదండ్రుల నిరసన

పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థి తల్లిదండ్రులు

ప్రజాశక్తి-గోపవరం

మండలం పరిధిలోని మడకలవారిపల్లి పురపాలక పరిధిలో ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కోటపాటి అరుణ అనే విద్యార్థినిపై ఉపాధ్యాయురాలు రవణమ్మ చితకబాదిన ఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే... అట్లూరు మండలం బాల్‌రెడ్డిబావి గ్రామానికి చెందిన కోటపాటి అరుణ క్రిస్మస్ సెలవుల నిమిత్తం ఇంటికి వెళ్లి, సెలవులు ముగిసిన అనంతరం తల్లిదండ్రులు రెండు రోజులు ఆలస్యంగా పాఠశాలకు వచ్చింది. ఆగ్రహించిన ఉపాధ్యాయురాలు రవణమ్మ తల్లిదండ్రులతో దురుసుగా ప్రవర్తించడంతో పాటు విద్యార్థినిని కొట్టినట్లు బాధితులు ఆరోపించారు. ఈ విషయాన్ని విద్యార్థిని తల్లిదండ్రులకు తెలియజేయడంతో వారు ఉపాధ్యాయురాలితో వాగ్వాదానికి దిగారు. పాఠశాలలో మౌలిక వసతుల కొరత తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. కోతుల బెడద ఎక్కువగా ఉండటంతో పలువురు విద్యార్థులు గాయపడిన ఘటనలు కూడా ఉన్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలో జరుగుతున్న విషయాలు బయటకు రాకుండా విద్యార్థులను భయపెడుతున్నారని ఆరోపించారు. చాలా రోజులుగా ఇలాంటి సంఘటనలు జరుగుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఉపాధ్యాయురాలు రవణమ్మను వివరణ కోరగా, విద్యార్థినిని కొట్టిన విషయం నిజమేనని అంగీకరిస్తూ, అది తన తప్పేనని, క్షమాపణ కూడా చెప్పినట్లు తెలిపారు. అయినప్పటికీ తల్లిదండ్రులు తన మాట వినకుండా ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆమె పేర్కొన్నారు. ఈ ఘటనపై గురుకుల పాఠశాల ఇన్‌ఛార్జి భానుమతిని వివరణ కోరగా ఈ విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిబంధనల ప్రకారం ఉపాధ్యాయురాలిపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాధిత తల్లిదండ్రులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థికి పుస్తకాన్ని అందజేస్తున్న వీరాస్వామి

వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి-కలసపాడు: చిన్ననాటి నుండే నైతిక విలువలు అలవర్చుకోవాలని వివేకానంద ఫౌండేషన్ సంస్థ గౌరవ సలహాదారులు చెముడూరి వీరాస్వామి విద్యార్థులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో 'విద్యార్థులకు వివేకానందుడి బోధనలు'పై చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ స్వామి వివేకానందుడి వంటి మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఉన్నతమైన లక్ష్యాలను సాధించడానికి ప్రణాళిక బద్ధంగా చదువుకోవాలన్నారు. అనంతరం 144 మంది బాలికలకు విజయానికి మార్గం, స్వామి వివేకానంద జీవిత చరిత్ర పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి, ఉపాధ్యాయులు మహబూబ్ చాంద్, గురులక్ష్మి, అమరావతి, సంస్థ ప్రతినిధి చంద్రశేఖర్ ఆచారి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : 'చమర్తి'

ప్రజాశక్తి-ఒంటిమిట్ట: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందని నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్ మోహన్‌రాజు తెలిపారు. సోమవారం స్థానిక మండల పార్టీ కార్యాలయంలో మండల స్థాయి కార్యకర్తల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి నాయకులు నిరంతరం ప్రజలతో మమేకమవుతూ ఉండాలన్నారు. సూపర్‌సిక్స్ వంటి పథకాలను అమలు చేస్తున్నామని, గ్రామ స్థాయిలో ప్రతి కార్యకర్త పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత తీసుకోవాలన్నారు. ఏ స్థాయిలో ఉన్న నాయకులైన స్థానికంగా ఉన్న గ్రామ మండల కమిటీలతో కలసి పనిచేయాలన్నారు. గ్రామ నాయకులు మండల నాయకులు వారితో చర్చించి వారిని కలిపే బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం మాధవరం, నడింపల్లె, కొండమాచుపల్లె గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి విడివిడిగా చర్చించి నాయకులకు, కార్యకర్తలకు చమర్తి పలు విషయాలపై దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జడ్‌పిటిసి, ఎంపిటిసి, గ్రామ అధ్యక్షులు కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

బేకరీ షాపుల్లో తనిఖీ

ప్రజాశక్తి-కడప అర్బన్ : కడపలో నూతన సంవత్సరం సందర్భంగా పలు బేకరీ షాపుల్లో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రమేష్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ హరిణి తనిఖీ నిర్వహించారు. కేక్ తయారీ చేస్తున్న ప్రదేశాలు శుభ్రంగా ఉన్నాయా లేదా, ఎంత మేర నాణ్యతతో తయారు చేస్తున్నారో స్వయంగా వెళ్లి తనిఖీ చేశారు. తయారీ సమయంలో నాణ్యత, శుభ్రత పాటించకపోతే తగిన చర్యలు తీసుకుంటామని కేక్ తయారీ యాజమానులను హెచ్చరించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఎడ్యుకేషన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, పూజిత్ పాల్గొన్నారు.

చేయాల్సిందంతా చేసి కన్నీరు కార్చడమెందుకో? : 'గడికోట'

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్: రాష్ట్ర మంత్రిగా ఉండి, జిల్లాల పునర్విభజనం అంశంపై జరిగిన మంత్రి వర్గ సమావేశంలో పాల్గొని అడ్డుచెప్పకపోగా, సమావేశం అనంతరం బయటకు వచ్చి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి కన్నీరు కార్చడంపై వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి మండిపడ్డారు. సోమవారం ఆయన ఒక వీడియోను విడుదల చేశారు. ఎన్నికల సమాయంలో రాయచోటిలో జరిగిన బహిరంగ సభలో చంద్రబాబు రాయచోటిని జిల్లా కేంద్రం గానే కొనసాగిస్తామని ప్రజలకు హామీయిచ్చారన్నారు. నేడెమో పలురకాల సాకులు చెబుతూ జిల్లా కేంద్రంను రద్దుచేయడం చంద్రబాబుకు ఎంతవరకు సమంజసమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాయమాటలు చెప్పి తాను అధికారాన్ని దక్కించుకున్నాక వెన్నుపోటు పొడవడం చంద్రబాబుకు సహజ స్వభావమన్నారు.

ఆర్కిటెక్చర్ వర్సిటీ అధ్యాపకుడికి ఉత్తమ యంగ్ రీసెర్చర్ అవార్డు

ప్రజాశక్తి - కడప అర్బన్

డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో యానిమేషన్ విభాగానికి చెందిన డాక్టర్ ఉండేల శివకృష్ణారెడ్డి సైరో (సైంటిఫిక్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్) ఉత్తమ యంగ్ రీసెర్చర్ అవార్డును అందుకున్నారు. హైబ్రిడ్ డీప్ లెర్నింగ్ టెక్నిక్స్ ద్వారా యానిమేటెడ్ వీడియోల నాణ్యతను మెరుగుపరిచే అంశాలపై చేసిన పరిశోధనలకుగాను ఆయనను ఉత్తమ యంగ్ రీసెర్చర్‌గా ఎంపికయ్యారని సైరో ఫౌండర్ చైర్మన్ డాక్టర్ మారుతి ప్రసాదరెడ్డి తెలిపారు. డాక్టర్ ఉండేల శివకృష్ణారెడ్డి స్వస్థలం చాపాడు మండలం విశ్వనాథపురం గ్రామం. చెన్నైలోని హిందుస్తాన్ యూనివర్సిటీ, కంప్యూటర్ సైన్స్ విభాగంలో సహాయ ఆచార్యులు డాక్టర్ సత్యదుర్గ మార్గదర్శకత్వంలో పిహెచ్‌డి పట్టా పొందారు. ఇప్పటివరకు 10కు పైగా జాతీయ, అంతర్జాతీయ స్థాయి జర్నల్స్‌లో ఆయన పరిశోధనా వ్యాసాలు ప్రచురితమయ్యాయి. ఇదే అంశం ఇతివృత్తంగా ఈ విద్యా సంవత్సరంలో ప్రపంచ వ్యాప్తంగా వెలువడిన 52 పరిశోధన పత్రాల్లో ఉండేల శివకృష్ణారెడ్డి పరిశోధన ఫలితాలు క్రోడీకరించడం గమనార్హం. ప్రస్తుతం విశ్వవిద్యాలయ ప్రజాసంబంధాల అధికారిగా అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ విసి ఆచార్య బి.జయరామిరెడ్డి, అధ్యాపక బృందం డాక్టర్ ఉండేల శివకృష్ణారెడ్డికి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

శివకృష్ణారెడ్డిని అభినందిస్తున్న విసి జయరామిరెడ్డి

జిల్లాల మార్పు చేయడం సరికాదు : వైసిపి

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న శివప్రసాద్‌రెడ్డి

ఈ రాష్ట్రంలో ఎవరూ చేయని సంక్షేమం ఒక్క వైఎస్ జగన్ మాత్రమే చేయడమే కాకుండా తన పాలనలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని వైసిపి అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. వైసిపి కడప జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 70 ఏళ్లుగా ఎన్నికలు జరుగుతుంటే ఏ ఒక్క పార్టీతో జత కట్టకుండా ఒక్క జగన్ మాత్రమే ముందుకు నడిచాడన్నారు. తన జెండా, ఎజెండాతో మాత్రమే ఎన్నికలకు వెళ్లిన పార్టీ వైసిపి అన్నారు. గుర్తింపు పొందిన ఆరు జాతీయ పార్టీలు కూడా ఏదో ఒక సందర్భంలో పొత్తులు పెట్టుకున్నాయని, ఎప్పుడైతే ఒక రాజకీయపార్టీ మరో జెండాతో జతకడుతుందో అప్పుడే సొంత బలం లేదని తేలిపోతుందన్నారు. మన రాష్ట్రంలో కూటమి అధికారంలో ఉందని, ఈ మూడు పార్టీలకు విడిగా వైసిపిని ఓడించే బలం ఉందా? అని ప్రశ్నించారు. వారికి సొంతగా గెలిచే బలం లేదు కాబట్టే మూడు పార్టీలు జత కట్టాయన్నారు. ఎన్నికలకు ముందు పవన్ కళ్యాణ్ పెద్ద పెద్ద మాటలు చెప్పాడని, కేవలం చంద్రబాబు ఇచే ప్యాకేజీతో నోరు మూసుకున్నాడన్నారు. ఓ పక్క టిడిపి, మరో పక్క బిజెపి లేకపోతే నీ మనుగడే లేదని, అలాంటిది నువ్వు జగన్ ను ఏమి చేయగలవన్నారు. దేశంలో చంద్రబాబు అంత అవకాశవాది ఎవరూ లేరని, ఆయన జత కట్టని పార్టీ లేదన్నారు. ఆయనకు కేవలం అధికార దాహం మాత్రమే ఉందన్నారు. ఓటమి, కష్టాలను ఆహ్వానించాడు కానీ తలొగ్గలేదని, అలాంటి విలువలు కలిగిన జగన్ మా నాయకుడు అయినందుకు గర్వపడుతున్నానన్నారు. నా శ్వాస ఆగిపోయేంత వరకు జగన్‌తోనే నా ప్రయాణమన్నారు. జిల్లాల విభజనలో పరిపాలన సౌలభ్యం, ప్రజల అభిప్రాయం అవసరమని, తమ ఓట్లకు, సీట్లకు అనుకూలంగా జిల్లాల విభజన చేయడం సరికాదన్నారు. చివరికి అన్నమయ్య పేరుపై ఉన్న జిల్లాను కూడా ఇలా చేయడం సరికాదన్నారు.

నేడు గంగమ్మ హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

మండల పరిధిలోని కొత్తపేట సమీపంలోని శ్రీ గంగమ్మ దేవత దేవస్థానంలో శాశ్వత హుండీలను మంగళవారం లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఒక ప్రకటణలో ఎం.కృష్ణనాయక్ పేర్కొన్నారు. దేవాదాయశాఖ అధికారులు, ఆలయ పాలక మండలి సమక్షంలో హుండిలను లెక్కిస్తామన్నారు

ఎస్‌వియూ పాఠ్య ప్రణాళిక సంఘం సభ్యులుగా ఆచార్య టి.రామప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయంలోని తెలుగుశాఖ ఆచార్యులు తప్పెట రామప్రసాద్‌రెడ్డి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని విదేశీ భాషలు, భాషాశాస్త్రం విభాగానికి చెందిన పాఠ్య ప్రణాళిక సంఘం సభ్యులుగా నియమితులయ్యారు.ఆచార్య రామప్రసాద్‌రెడ్డి గతంలో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం,మద్రాస్ విశ్వవిద్యాలయం, కర్ణాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, రాయలసీమ విశ్వవిద్యాలయం, కృష్ణా విశ్వవిద్యాలయం, శ్రీ సత్యసాయి విశ్వవిద్యాలయం వివిధ స్వయం ప్రతిపత్తి డిగ్రీ కళాశాల తెలుగుశాఖలకు పాఠ్య ప్రణాళిక సంఘం సభ్యులుగా నియమితులయ్యారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,బెంగుళూరు విశ్వవిద్యాలయం, ద్రావిడ విశ్వవిద్యాలయం,శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ,మద్రాస్ విశ్వవిద్యాలయం కర్ణాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం బోధన సిబ్బంది నియామక సభ్యులుగాకూడా గతంలో నియమితులయ్యారు. బిఒఎస్ సభ్యులుగా నియమితులైన ఆచార్య రామప్రసాదరెడ్డిని యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్,రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, వివిధ శాఖల ఆచార్యులు, బోధనేతర సిబ్బంది అభినందించారు.

గుండెపోటుతో డిపిఒ ఎఒ రమణ మృతి

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లా పోలీస్ కార్యాలయ ఎఒ కె.వి.రమణ(56) సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రయివేట్ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మరణించినట్లు ప్రకటించారు. కె.వి.రమణకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కె.వి.రమణ భౌతిక కాయాన్ని జిల్లా పోలీస్ కార్యాలయానికి తరలించారు. ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ కె.వి.రమణ భౌతిక కాయంపై పుష్పగుచ్చం ఉంచి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఎస్‌పితో పాటు పలువురు పోలీస్ అధికారులు, డిపిఒ సిబ్బంది కె.వి రమణ భౌతిక కాయానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్‌పి బి.రమణయ్య, కడప డిఎస్‌పి ఎ.వెంకటేశ్వర్లు, వన్ టౌన్ సిఐ చిన్నపెద్దయ్య, ఆర్ఐలు శివరాముడు, సోమశేఖర్ నాయక్, డిపిఒ సూపరింటెండెంట్ శ్రీనివాస నాయక్, సురేష్, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, డిపిఒ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న ఎస్ఇ రమణ

'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఇ'కి స్పందన

ప్రజాశక్తి - కడప

విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం ఎపిఎస్‌పిడిసిఎల్ నిర్వహిస్తున్న డయల్ యువర్ ఎస్ఇ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. జిల్లా కార్యాలయంలో సోమవారం ఉదయం 9 గంటల నుండి 10 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా మొబైల్ కమ్యూనికేషన్ ద్వారా 9 మంది వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను ఎస్ఇ ఎస్.రమణ దృష్టికి తీసుకువచ్చారు. అందిన ఫిర్యాదుల్లో 4 ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించారు. మూడు ఫిర్యాదులు విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు సంబంధించినవి. వీటిని ప్రాధాన్యతా క్రమంలో త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు ఎస్ఇ తెలిపారు. రెండు ఫిర్యాదులు కోర్టు కేసులకు సంబంధించినవి, చట్టపరమైన ప్రక్రియల ప్రకారం పరిష్కరిస్తామని పేర్కొన్నారు. వినియోగదారుల సమస్యలను స్వయంగా పరిశీలించి, సాధ్యమైన పరిష్కారాలు తీసుకోవడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మధుసూదన్, డిఇఇలు మోహన్, నాగముని స్వామి, జూనియర్ ఇంజినీర్ సుధీర్ పాల్గొన్నారు.

బాలల సహాయవాణి పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప

ఇబ్బందుల్లో ఉన్న పిల్లలకు సహాయం అవసరమైనప్పుడు ఏ పిల్లవాడైనా లేదా ఆందోళన చెందిన పెద్దైనా 1098కు డయల్ చేయవచ్చునని డిఆర్‌ఒ ఎం.విశ్వేశ్వర నాయుడు తెలిపారు. సోమవారం జిల్లా సచివాలయంలోని సభా భవన్‌లో మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడుస్తోన్న బాలల సహాయ వాణి 1098 పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల సహాయవాణి 1098 అనేది భారతదేశంలో 24 గంటలు, 365 రోజులు అందుబాటులో ఉండే ఉచిత అత్యవసర టోల్ ఫ్రీ సేవ అని,ఇబ్బందుల్లో ఉన్న పిల్లలకు సహాయం అవసరమైనప్పుడు ఏ పిల్లవాడైనా లేదా ఆందోళన చెందిన పెద్దైనా 1098కు డయల్ చేయవచ్చునని ఈ సేవ మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడుస్తోందని ఇది పిల్లల అత్యవసర అవసరాలకు స్పందిస్తుందని మరియు వారిని దీర్ఘకాలిక సంరక్షణ మరియుపునరావాస సేవలతోఅనుసంధానిస్తుందనన్నారు. వైద్య సహాయం, ఆశ్రయం, ఆహారం, కౌన్సెలింగ్, రక్షణ వంటి సేవలు అందిస్తుందనన్నారు.జిల్లా మహిళా శిశు సంక్షేమ, మహిళా సాధికారిత అధికారి పి. రమాదేవి మాట్లాడుతూ బాల్య వివాహ ముక్త భారత్ అభియాన్ దేశవ్యాప్తంగా బాల్య వివాహాలను నిర్మూలించడానికి చేపట్టిన జాతీయ కార్యక్రమమని, బాల్య వివాహాలు పిల్లల హక్కులను దెబ్బతీస్తాయని, విద్య, ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయనన్నారు. బాలల హక్కుల రక్షణకు, సమాజంలో అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు బాల్య వివాహాల నివారణపై ప్రతిజ్ఞ చేశారు

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడు

దూడలకు నట్టల నివారణ మందు తాపిస్తున్న వైద్యాధికారులు

పెయ్య దూడల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

పెయ్యదూడల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ రాజ తిమ్మారెడ్డి సూచించారు. మైదుకూరు మండలం మాచుగారిపల్లి గ్రామంలో సోమవారం ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని పశుగణాభివృద్ధి సంస్థ సహకారంతో ఆ శాఖ నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు వాటాగా రూ.150చెల్లించి పెయ్యదూడల సూదుల పథకం ప్రవేశపెట్టిందన్నారు. పశువు ఎదకు వచ్చినప్పుడు ఈ సూది వేయడం వల్ల పెయ్యదూడలు మాత్రమే పుడుతాయన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరంలో 9 చూడి పశువులకు పరీక్షలు, 19 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు, 48 దూడలకు నట్టల నివారణ మందులు, 79 పశువులకు సాధారణ చికిత్సలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వనిపెంట పశువైద్య అధికారి సి.గురివిరెడ్డి, డాక్టర్ విజయనిర్మల, సిబ్బంది ఎం యశోద, పశుసంవర్ధక సహాయకులు, గోపాలమిత్రలు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

లైంగిక దాడుల నివారణకు కృషి చేయాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

బాలలపై లైంగిక దాడుల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిహెచ్‌సి వైద్యాధికారులు శ్రీకాంత్, కరిష్మా సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్యాధికారులు ఆధ్వర్యంలో బాలలపై లైంగిక దాడుల నివారణపై ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలకు మండలస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జమ్మలమడుగు ప్రాంతీయ ఆరోగ్య కేంద్రం బాలల సత్వర చికిత్స కేంద్రం చైల్డ్ సైకాలజిస్ట్ ఉదయ చంద్రిక, రాష్ట్రీయ కిషోర స్వస్తియా యుక్త వయసు కౌన్సిలర్ డి.బాల గురప్ప పిల్లలపై జరిగే లైంగిక దాడుల రకాలు, మానసిక గాయాలు, ప్రవర్తన వాటి ప్రభావాలపై శిక్షణనిచ్చారు. పిల్లలపై అకృత్యాలు జరగకుండా చూడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పిల్లల రాతలు, మాటలు, హావ భావాలు, హద్దులుపై అవగాహన కల్పించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పిల్లల రక్షణ కోసం అమలు చేస్తున్న ఫోక్సో చట్టం చైల్డ్ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1098 అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ ప్రసాద్ యాదవ్, సూపర్‌వైజర్ రామారావు, హెల్త్ అసిస్టెంట్ జయకర్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ విశాలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎన్.తులసిరెడ్డి

మోడీ పాలన అన్ని విధాలా విఫలం

ప్రజాశక్తి - వేంపల్లె

నరేంద్ర మోడీ పాలనలో 2025లో అన్ని విధాలా విఫలమైందని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేని విధంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ పాతాళానికి పడిపోయిందన్నారు. భారతీయ విద్యార్థులకు విదేశీ విద్య భారమైందని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికాలో ఉంటున్న భారత అక్రమ వలసదారులను అమెరికా ప్రభుత్వం మానవత్వం లేకుండా అక్కడి నుంచి భారతదేశానికి పశువుల్లా పంపిస్తే మోడీ ప్రభుత్వం కనీసం నిరసన కూడా తెలియజేయలేదని విమర్శించారు. విమాన ప్రయాణికులు నరకం చూశారని, ఇది మోడీ ప్రభుత్వం వైఫల్యానికి పరాకాష్ట అన్నారు. దేశ రాజధాని ఢిల్లీ కాలుష్యంతో నివాసయోగ్యంకాని స్థితికి చేరుకోవడం సిగ్గుచేటన్నారు. 2025లో ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం జరిగిందన్నారు. భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ రాజీనామా చేస్తే ఆయనకు కనీసం వీడ్కోలు కూడా పలకలేదన్నారు. జాతిని అవమాన పరిచేలా మహాత్మా గాంధీ పేరును ఉపాధి హామీ చట్టం నుంచి తొలగించారన్నారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, ప్రసాద్ గౌడ్, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి, వేంపల్లి మండల శాఖ అధ్యక్షులు రామకృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బండారు వెంకటేశు, నాగరాజు, ఐచర్ రమణ, వినయ్ పాల్గొన్నారు.

2 నుంచి గ్రామాల్లో భూముల రీసర్వే

ప్రజాశక్తి - సింహాద్రిపురం

జనవరి 2నుంచి మూడు గ్రామాల్లో భూములు రీ సర్వే చేస్తున్నట్లు తహశీల్దార్ వెంకట సాయినాథ్ రెడ్డి పేర్కొన్నారు. ఆ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ గురజాల, లోమడ, బలపనూరు గ్రామాల్లో రీ సర్వే చేయనున్నట్లు తెలిపారు. గతంలో భూములు రీ సర్వే చేసిన తెలికి, దేవతాపురం, సింహాద్రిపురం, హిమకుంట్ల, నిడువెలగల గ్రామాల్లో రైతులకు కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు.

దత్తాత్రేయ స్వామి దేవస్థానం హుండీ కానుకల లెక్కింపు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

శ్రీసుంకు వెంకట సుబ్బయ్య సత్రం అనుబంధ ఆలయమైన దత్తాత్రేయ స్వామి దేవస్థానంలో సోమవారం హుండీ కానుకలను లెక్కించారు. 13 నెలలకు రూ.50,236 వచ్చిందని ఇఒ శ్రీధర్ తెలిపారు. లెక్కింపు ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో సత్రం ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజశేఖర్, జూనియర్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాస్ రెడ్డి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ కానుకలను లెక్కుస్తున్న అధికారులు

క్రైం కార్నర్

రైలు కిందపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

నందలూరు రైల్వేస్టేషన్, మండపంపల్లె రైల్వేస్టేషన్ మధ్య తిరుమల నుంచి వస్తూ ప్రమాదవశాత్తూ సోమవారం ఉదయం రైలు 16382(కేప్ పూణె ఎక్స్‌ప్రెస్) కిందపడి మృతి చెందాడు. మృతుడు హెచ్ శ్రీనివాసులు (34)గా గుర్తించారు. అతనిది కర్నూలు జిల్లా ఆస్పరి మండలం శంకరంబాడీ గ్రామం. కూలి పనులు చేసుకుంటూ జీవిస్తుంటాడని కడప రైల్వే పోలీసులు తెలిపారు. కేసు విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు.

మద్యం షాపులు అర్ధరాత్రి వరకు తెరచి ఉంచొద్దు

ధర్నా చేస్తున్న ఐద్వా, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు

నూతన వేడుకల సంధ్భంగా ఈనెల 31న అర్ధరాత్రి వరకు మద్యం షాపులను తెరిచి ఉంచొద్దని మహిళా సంఘం (ఐద్వా) ప్రొద్దుటూరు కమిటీ డిమాండ్ చేసింది. నూతన సంవత్సరం పేరుతో అర్ధరాత్రి వరకు మద్యం షాపులు తెరిచి ఉంచడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఐద్వా జిల్లా కార్యదర్శి ముంతాజ్ బేగం పేర్కొన్నారు. ఆ మేరకు సోమవారం స్థానిక సిప్‌ఇన్ బార్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ముంతాజ్ బేగం మాట్లాడుతూ నూతన సంవత్సరం వేడుకల పేరుతో ఈనెల 31 నుంచి జనవరి ఒకటో తేదీ తెల్లవారుజాము వరకు మద్యం అమ్మకాలు ఎక్కువగా జరుగుతున్నట్లు గత అనుభవాలు చెబుతున్నాయని వివరించారు. యువత మద్యం అధికంగా సేవించి రోడ్లపై అసభ్యంగా ప్రవర్తిస్తూ ప్రజలకు ముఖ్యంగా మహిళలకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాలకు గురై కొందరు ప్రాణాలు కోల్పోతున్నారని, వారి కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే తాట తీస్తామని ప్రభుత్వం చెబుతున్నా.. గ్రామాల్లో మాత్రం బెల్ట్‌షాపుల పేరుతో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్నారు. మద్యాన్ని ఆదాయ వనరుగా చూస్తున్న ప్రభుత్వం విధానాన్ని నిలదీస్తేనే కొత్త సంవత్సరం మహిళల జీవితాల్లో వెలుగులు వస్తాయన్నారు. కోడిపందేల పేరుతో సంక్రాంతిని కూడా కాంతి లేకుండా చేసే ప్రయత్నాలను ప్రశ్నించాలని కోరారు. మద్య నియంత్రణ కోసం ప్రయత్నం చేస్తూ కొత్త ఏడాదికి ఆహ్వానం పలకాలని సూచించారు. ఈనెల 30, 31, జనవరి 1తేదీల్లో అర్ధరాత్రి వరకు మద్యం షాపులకు అనుమతి ఇవ్వద్దని అధికారులను కోరారు. రాత్రి ఏడు గంటలకే మూసివేయాలని సూచించారు. ధర్నాలో మహిళా సంఘం నాయకులు గురమ్మ, ప్రమీలమ్మ, విజయకుమారి, ఝాన్సీ, అన్నపూర్ణ, సూరమ్మ, వెంకటలక్ష్మి, శాంతి, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

మద్యం అమ్మకపు పని గంటలు కుదించాలి

ఎస్ఐకి వినతిపత్రమిస్తున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు

బ్రహ్మంగారిమఠం : నూతన సం వత్సర వేడుకల సం దర్భంగా మద్యం అమ్మ కాల గంటలను కుదిం చాలని ఎస్ ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయ కులు డిమాండ్ చేశారు. ఆ మేరకు సోమవారం ఎస్ఐకి వినతి పత్రం అంద జేశారు. ఈసందర్భంగా ఎస్ ఎఫ్ఐ, డివైఎఫ్ఐ మండల నాయకులు ఎర్రంపల్లి అజయ్‌కుమార్, రెబ్బ నరసింహులు మాట్లాడుతూ నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా ప్రభుత్వం మద్యం అమ్మకాలను నిలువరిస్తేనే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగవన్నారు. కార్యక్రమంలో నాయకులు రాహుల్, అరవింద్ పాల్గొన్నారు.

బహిరంగ, ప్రభుత్వ స్థలాల్లో మద్యం సేవిస్తే కేసులు

మాట్లాడుతున్న సిఐ నరేష్ బాబు

జమ్మలమడుగు : ప్రభుత్వ స్థలాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామని జమ్మలమడుగు అర్బన్ సిఐ నరేష్ బాబు హెచ్చ రించారు. స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయన మాట్లా డుతూ నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొనేవారు తగు జాగ్రత్తలు తీసుకో వాలన్నారు. ప్రమా దాలకు దూరంగా ఉంటూ పిల్లలు, పెద్దలు అందరూ వారి ఇళ్లలో ఉత్సవాలు జరుపుకో వాలన్నారు. ఎస్పి ఆదేశాలను భేఖాతారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈనెల 31న రాత్రి జిల్లాలో నిర్వహించుకునే నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జిల్లా పోలీస్ యంత్రాంగం మొత్తం పటిష్టమైన బందోబస్త్‌తోపాటు నిత్యం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసే విధంగా ప్రవర్తించరాదన్నారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కార్యక్రమాలను రాత్రి 12:30 గంటలలోపు పూర్తి చేసుకోవాలన్నారు. తర్వాత కొనసాగిస్తే చర్యలుంటాయన్నారు. పిల్లల పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని సిఐ కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పట్టణంలోని పలు ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు రక్షణ కంచె లేకుండా ప్రమాదకరంగా ఉన్నాయి. పెద్ద పసుపల మోటు వద్ద ఉన్న బాలాజీ స్కూల్ వెనుక భాగాన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కంచె వేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హరిబాబు కోరారు. ఆ మేరకు సోమవారం ఆయన ఆర్‌డిఒ కార్యాలయంలో ఎఒ ఇక్బాల్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ కొన్ని పాఠశాలలు, ప్రజలు సంచరించే ప్రదేశాల్లో ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచె లేదు. సంబంధిత అధికారులు కంచెలు ఏర్పాటు చేయకపోవడం చాలా దారుణమన్నారు. ముఖ్యంగా పాఠశాలల వద్ద కంచెలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వందల సంఖ్యలో విద్యార్థులు చదువును అభ్యసిస్తున్నారని, వారికి ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరిని అడగాలని ప్రశ్నించారు. ముందస్తుగానే పాఠశాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచెను ఏర్పాటు చేయాలని కోరారు. పట్టణంలో గంగమ్మ దేవాలయం, పాత బస్టాండ్‌లోని ఆటో స్టాండ్, అన్నా క్యాంటీన్ పక్కన, సంజావుల మోటు వద్ద ఇలా అనేక ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచె లేదన్నారు. విద్యుత్ అధికారులు త్వరగా స్పందించాలని కోరారు. లేని పక్షంలో విద్యార్థులతో ర్యాలీ, ధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు ఖాదర్, చరణ్ దస్తగిరి, మధు, నరేంద్ర, సూరి పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పులివెందులకు కృష్ణా జలాలు తెచ్చింది వైఎస్ఆర్ : ఎంపీ

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందులకు కృష్ణా జలాలు తెచ్చిన ఘనత వైఎస్‌దేనని కపడ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. స్థానికంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రాంత ఏ రైతును అడిగినా పులివెందులకు నీళ్లు తెచ్చిందెవరో చెబుతారని అన్నారు. అవగాహన లేకుండా బీటెక్ రవి మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. రేషన్ ప్రజలకు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని తమ నాయకులు వైఎస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కౌన్సిలర్లు ఆర్‌డిఒను కలవడంలో తప్పేముందన్నారు. రెండవసారి జగనన్న లేఔట్‌లో పేదలకు ఇచ్చిన దాదాపు 80 పైచిలుకు ఇంటి నిర్మాణాలు నిలిచిపోయాయని, వాటిని త్వరితగతిన ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పూర్తి చేసేలా చూడాలని ఆర్‌డిఒను కోరారని తెలిపారు. గత ప్రభుత్వంలో జగన్మోహన్‌రెడ్డి రూ.480 కోట్లతో పులివెందుల వాసులకు నీళ్లు ఇవ్వాలని వాటర్ గ్రిడ్ పథకం మంజూరు చేశారన్నారు. గత ప్రభుత్వంలోనే 60 నుంచి 70 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. వాటర్ గ్రిడ్ పథకం రాకముందు సిబిఆర్ నుంచి 1040 పల్లెలకు నీటి సరఫరా పథకం నడుస్తుందన్నారు. వేంపల్లి పాతపట్నం నుంచి 18 పల్లెలకు చక్రాయపేట మండలంలో కే రాజుపల్లి నుంచి వాటర్ స్కీం నడుస్తుందన్నారు. వైఎస్ హాయంలోనే నక్కలపల్లి నుంచి సమ్మర్ స్టోరేజ్ స్కీం ద్వారా పులివెందులకు నీళ్లు అందించారన్నారు. నీళ్ల విషయంలో ఎలాంటి రాజీ లేకుండా ప్రజలు ఇబ్బందులు పడకుండా ఇంతకాలం పనులు చేపట్టామన్నారు. 18 నెలలు కూటమి ప్రభుత్వంలో పులివెందుల మున్సిపాలిటీకి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఈ కాలంలో ఏమి అభివృద్ధి చేశారని ఆయన బీటెక్ రవిని ప్రశ్నించారు. గండికోట నుంచి సిబిఆర్‌కు ఎత్తిపోతల పథకం ద్వారా వైఎస్ఆర్ తీసుకొచ్చారన్నారు. గండికోట ముంపు వాసులకు రూ.వెయ్యి కోట్ల పరిహారం ఇచ్చిన ఘనత వైఎస్ఆర్‌దే అన్నారు. మాట్లాడేటప్పుడు చరిత్ర తెలుసుకొని అవగాహనతో మాట్లాడాలని బిటెక్ రవికి హితవు పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సాంబశివారెడ్డి, లింగాల మండలం కన్వీనర్ అంబకపల్లి బాబురెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వరదకు వినతిపత్రమిస్తున్న ప్రొద్దుటూరు జిల్లా సాధన సమితి సభ్యులు

ప్రొద్దుటూరు జిల్లా కేంద్రానికి అనువైన ప్రాంతం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు జిల్లా కేంద్రానికి అనువైన ప్రాంతమని ప్రొద్దుటూరు జిల్లా సాధన సమితి సభ్యులు తెలిపారు. ప్రొద్దుటూరును జిల్లా కేంద్రంగా చేయాలని కోరుతూ సోమవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రొద్దుటూరు జిల్లా సాధన సమితి సభ్యులు డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి, న్యాయవాది సివి సురేష్, స్పందన రాంప్రసాద్‌రెడ్డి, నేతాజీ భాస్కర్‌రావు, అపర్ణ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

రికార్డులను తనిఖీ చేస్తున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

ఉచిత న్యాయ సహాయం పొందండి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ కోర్టు జడ్జి బాబా ఫక్రుద్దీన్ సూచించారు. జమ్మలమడుగు, ప్రొద్దుటూరు సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను సోమవారం ఆయన విజిట్ చేశారు. ఈ సందర్భంగా బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ డాక్టర్ సి యామిని సూచనల మేరకు తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను, జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, ఖైదీలతో మాట్లాడి వారి కేసుల వివరాలు, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100పై ప్రచారం చేశారు. ఏవైనా సమస్యలుంటే జమ్మలమడుగు మండల న్యాయ సేవా సమితిని, ప్రొద్దుటూరు మండల న్యాయ సేవా సమితిని, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్రదించవచ్చు అన్నారు. కార్యక్రమంలో జమ్మలమడుగు, ప్రొద్దుటూరు సబ్‌జైలు సూపరింటెండెంట్లు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు, ఖైదీలు పాల్గొన్నారు.

అధికారుల సూచనల మేరకు యూరియా వాడాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు సూచించిన మేరకు పంటలకు యూరియా వాడాలని వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి రైతులకు సూచించారు. బొందలకుంట రైతు సేవా కేంద్రంలో సోమవారం ఆయన రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ బొందలకుంట, యామవరం రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందన్నారు. డిబిటి పద్ధతిలో రైతులకు యూరియా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కొర్రపాడు, శెట్టివారిపల్లె, కొత్తపల్లె, కొలవలి రైతు సేవా కేంద్రాల్లో రైతులకు యూరియా అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎఒ కోరారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీ చేస్తున్న ఎఒ వెంకటకృష్ణారెడ్డి

పట్టాదారు పాసుపుస్తకాలు పోయినవి

నా పేరు కొట్టే జయరాముడు తండ్రి(లేట్) కొట్టే రామచంద్రుడు నేను మైదుకూరులో మా ఇంటి నుండి జిరాక్స్ కోసం నేను వెళ్లే సందర్భంలో ఎస్ మైదుకూరు రెవెన్యూ పొలంలో నా తండ్రి పేరును ఉన్న పట్టాదారు పాసుపుస్తకాలు పోయినవి. పట్టాదారు పాసుపుస్తకం నెంబరు: 11306 V015000065 (పట్టా నెంబర్ 73); 24D 0858743604339 (పట్టా నెంబర్ 1339).
ఈ నెంబర్ గల పట్టాదారు పాస్ పుస్తకాలు దొరికినచో ఈ క్రింది తెలిపిన అడ్రస్‌కు చేర్చగలరు.

కె. జయరాముడు, S/o లేట్ రామచంద్రుడు, D.No.6/325-11-22, వినాయకనగర్, ప్రొద్దుటూరు రోడ్డు మైదుకూరు వైయస్సార్ కడప జిల్లా ఫోన్ నెంబర్ 8106060960.

అధికారులకు సూచనలిస్తున్న ఆర్‌డిఒ చిన్నయ్య

రైతు సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

ప్రజాశక్తి - తొండూరు

రైతు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పులివెందుల ఆర్‌డిఒ చిన్నయ్య అధికారులకు సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం తహశీల్దార్ బి.రామచంద్ర అధ్యక్షతన గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు, ప్రజలు ఆయా సమస్యలపై ఆర్‌డిఒకు వినతిపత్రాలు సమర్పించారు. రైతుల సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ అధికారులను హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రామకృష్ణారెడ్డి, మండల సర్వేయర్ రాఘవేంద్ర, ఆర్ఐ నాగరాజు, వీఆర్వో మధుసూదన్, రైతులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తాం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - కలసపాడు

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విన్నవించిన ప్రతి సమస్యనూ పరిష్కరించి న్యాయం చేస్తామని బద్వేలు రెవెన్యూ డివిజన్ అధికారి చంద్రమోహన్ పేర్కొన్నారు. రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలసపాడు మండలంలో ఎక్కువ భాగం ప్రజలకు భూ సమస్యలు ఉన్నాయన్నారు. వాటిపై అధికంగా ఫిర్యాదులు వచ్చాయన్నారు. రెవెన్యూ అర్జీలు మండలంలో అన్ని పంచాయతీలు మొత్తం 39 వచ్చాయన్నారు. పాత అర్జీలు పరిష్కారం చేశామన్నారు. త్వరలో వీటికి పరిష్కారం చేస్తామ న్నారు. కార్యక్రమంలో ఏపీ స్టేట్ రోడ్డు రవాణా డైరెక్టర్ సాధనకారి రంతు, తహశీల్దార్ మధురవాణి, డిప్యూటీ తహశీల్దార్ మోహనరాజు, ఆర్ఐ సింధుజ, ఎంపీడీఓ, విఆర్వోలు, సర్వేయర్లు, పలు శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న రెవెన్యూ సిబ్బంది, గ్రామ ప్రజలు

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

ప్రజాశక్తి - వేముల

మండల కేంద్రంలోని గొందిపల్లి, కొత్తపల్లి గ్రామ పంచాయతీలో సోమవారం సాయంత్రం గ్రామసభ నిర్వహించారు. రీ సర్వేలో భాగంగా భూ సమస్యల పరిష్కారానికి గ్రామసభలు దోహదం చేస్తాయని తహశీల్దార్ రెడ్డి లక్ష్మి పేర్కొన్నారు. రీ సర్వే ద్వారా జరిగిన తప్పులను సరిచేస్తున్నట్లు ఆమె తెలిపారు. గ్రామంలో భూములు ఉన్న రైతులు సర్వే నెంబరు ప్రకారం జనవరి 2 నుంచి కొలతలు వేయనున్నట్లు తెలిపారు. ఏవైనా భూ సమస్యలు ఉంటే మండల సర్వేయర్, వీఆర్వోకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. అవగాహన కోసం అధికారులు ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ తహశీల్దార్ జగదీష్ బాబు, మం డల సర్వేయర్ ప్రభాంజనేయులు, వీఆర్వో రామచంద్ర, గ్రామ సర్వేయర్ లు, టిడిపి నాయకులు ఎల్.మల్లిఖార్జునరెడ్డి, డి.సుధాకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రబీలో ఫసల్ బీమాపై చేతులేత్తేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి - వేంపల్లె

రబీలో ఫసల్ బీమాపై కూటమి ప్రభుత్వం చేతులేత్తేసిందని వైసిపి రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రబీలో అత్యధికంగా రైతులు పంటలు సాగు చేస్తారని చెప్పారు. అధిక వర్షాలతో పంటలు నష్టపోతే రైతులకు ఫసల్ బీమా ధీమాగా ఉంటుందని రైతులు ఆనందపడేవారని తెలిపారు. డిసెంబర్ 31 వచ్చినా ఇంతవరకు ఆన్‌లైన్‌లో కడప జిల్లా చూపించడం లేదన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం రైతుల మీద భారం పడకుండా ప్రభుత్వమే డబ్బు చెల్లించేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పాత పద్ధతిలో అమలు చేస్తామని హామీ కూడా ఇచ్చిందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు ఆన్‌లైన్‌లో చూపుతున్నప్పటికీ కడప జిల్లా మాత్రం లేదన్నారు. ఈ ఎడాది నువ్వులు, మినుము పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ముఖ్య మంత్రికి కడప జిల్లా అంటే కక్ష ఎందుకని ప్రశ్నించారు. జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు రైతుల బాధలు అర్థం కాలేదాని ఆయన ప్రశ్నించారు. జనవరి 30 వరకు గడువు పెంచి ఫసల్ బీమా చెల్లించేలా చూడాలని మస్తాన్‌రెడ్డి కోరారు.

షఫివున్నిసా బేగంను సన్మానిస్తున్న ఆరోగ్య సిబ్బంది

డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌కు సన్మానం

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని తాళ్ళపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ షఫీ వున్నిసా బేగంను సోమవారం వైద్య ఆరోగ్య సిబ్బంది ఘనంగా సన్మానిచారు. తాళ్ళపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా పని చేస్తున్న షఫివున్నిసా బేగంకు డిప్యూటీ డెమోగా ప్రమోషన్ ఇచ్చి, కర్నూలు డిఎంహెచ్‌ఒ ఆఫీసుకు బదిలీ చేశారు. ఈనేపథ్యంలో తాళ్ళపల్లె ఆరోగ్య సిబ్బంది ఆమెను ఘనంగా సత్కరించారు. విధి నిర్వహణలో చేసిన సేవలను వైద్యులు కొనియాడారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE :: KADAPA

O.S.NO: 1135 OF 2024

SURU VINOD KUMAR,Son of Suru Gurudaiah, residing at 41/297-3, Sri Kanyaka Heights, Near Mother India school, Sankarapuram, Kadapa City. **...Plaintiff**

Vs

VADLAKUNTA SREEKANTH, Son of Vadlakunta Balisetty, Hindu, residing at Door No: 12/244, Potti Sree Ramulu Street, Kadapa city. **...Defendant**

SUMMONS TO DEFENDANT UNDER ORDER 5 RULE 1 & 5 C.P.C

Where as the Plaintiff herein filed the suit against you being Defendant for recovery of debt due under Suit Pronote and the said suit stand posted on 02-01-2026 for your appearance therefore you being the Defendant here by instructed to appear before the Hon'ble court on 02-01-2026 at 10-30 A.M sharp personally or through an Advocate, failing which the matter will be decide as Ex-parte.

//By Order of the Hon'ble Court//

S.MD.KHALEEL GHOUSE & ABBAS KHAN
Advocates for Plaintiff